## మళ్ళీ మధుమాసం

వెళ్ళక తప్పింది కాదు ఆ గోష్ఠికి—

"రకరకాల వృత్తుల వాళ్ళని, ఆ వృత్తులలో కాకలుతీరి మేధావులుగా వున్న వాళ్ళని పిలిచి, అతి ముఖ్యమైన సమస్యగా దేశాన్ని వేధిస్తున్న ఈ విషయం మీద గోష్ఠి జరిపి, ఆ గోష్ఠి "సారాం"శాన్ని అనుసరించి దేశ భవిష్యత్తుని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాను. ఇందులో నిన్ను కలవడానికి కారణం నువ్వు నా క్లాసుమేటువని కాదు, నేను ఇటీవలే మంత్రి పదవి కొచ్చినందువల్ల నా ద్వారా నువ్వు పదిమంది గొప్ప వాళ్ళని కలుసుకొంటావనే కోరికా కాదు. నువ్వు నీ వృత్తిలో నిష్ణాతుడవని. అందువల్ల నీకు కలిగిన అనుభవాన్ని, ఆ అనుభవం బ్యాక్ గ్రౌండుగా నీ కేర్పడిన తెలివిని, సాటి పౌరులతో పంచుకుని బాధ్యతాయుతంగా ఈ సమావేశంలో నీ అభిప్రాయాలని వ్యక్తపరుస్తావని నిన్ను పిలవడం జరుగుతోంది" అని రాసేడు రామనారాయణ.

సంపూర్ణ మద్యనిషేధం అమలు పరచడానికి ప్రభుత్వం తల పెట్టింది. ఒక కేంద్రమంత్రి, ఒక మద్యనిషేధ వ్యతిరేక రాష్ట్రమంత్రి, ఒక ఎక్సయిజు సూపరింటెండెంటు, ఒక ప్రొహిబిషన్ డెప్యూటీ సూపరింటెండెంటు, న్యూరో స్పెషలిస్టు డాక్టరు, ఒక

మేధావంతుడయిన లాయరు, ఒక పోస్టుగ్రాడ్యుయేట్ సినిమా యాక్టరు, ఒక పెద్ద ఫ్యాక్టరీ యజమాని, ఒక రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, ఒక సంస్కృత విద్యాపీఠం అధ్యక్షుడు, ఇలాంటి వాళ్ళందరూ వున్నారు ఆహూతులలో. సీనియర్ పత్రికా విలేకరిగా నే నున్నాను. ఇంకా కొందరున్నారు : వాళ్ళ పేర్లనిబట్టి, అడ్రసులనుబట్టి నేను గ్రహించిన దేమిటంటే- ఒక భగ్న ప్రేమికుడు, ఒక సినిమా కవి, ఒక నాటక రచయిత, ఒక సీరియల్ నవలా రచయిత్రి, ఒక మహిళా సంఘా ధ్యక్షురాలు, ఒక బ్యాంకు గుమాస్తా, ఒక మిల్లు కార్మికుడు - ఇలాంటి వాళ్ళ కూడా వున్నా రాహూతులలో.

రామనారాయణ స్వయంగా బహురంగాల్లో మేధావి. గాంధీగారు బతికున్న రోజుల్లోనే మంత్రో, కనీసం గవర్నరో కావలసినవాడు. మన దేశంలో వుండిపోబట్టి అలా అట్టడుగుని ఉండిపోయా డిన్నా ళ్ళూనూ. అయితే మేధావి కనక; గుర్తింపు రాలేదు. కనక ఆ చింతతో రెండుసార్లు ఏడో అంతస్తు కిటికీలోంచి రోడ్డుమీదికి దూకడానికి ప్రయత్నించేడు. (రెండుసార్లూ నేనే రక్షించేను)

ముప్ఫయ్యేళ్లు బానిసతనంలోను, చివరి ఏణ్ణర్థమూ జైల్లోనూ గడిపి ఇటీవలే మంత్రయ్యేడు రామనారాయణ. ఇక తాను ఎత్తయిన భవనాలు ఎక్కడమే తప్ప అక్కణ్ణించి దూకడానికి ప్రయత్నించడు. (లిఫ్టుబాయ్‌లు దూకనివ్వరు. అసలు మెట్లు దిగనివ్వరు)

"నాకు దేశం అంటే యిష్టం. దేశమంటే మట్టికాదు, మనుషులు! అంచేత ఆ మనుషుల బాగుకోసమని ధారాళంగా పన్నులు కడతాను. నేను పన్నులు కడుతున్నానని నాకు తెలిసినా అందువల్ల ఆనందం తప్ప విషాదం కలగనివ్వనిది ఒక్క మద్యపానమే. అంచేత మద్య పాన నిషేధం నా కిష్టంలేదు!" అన్నా రొకరు. ఆ వరసలో అందరు తమ అభిప్రాయాలు చెప్పారిలాగ :-

"నా కష్టపడప్పుడు తాగే అలవాటుంది. కాని యావత్ దేశం క్షేమం కోరవలసి వచ్చినప్పుడు మన వ్యక్తిగత అవసరాలను త్యాగం చెయ్యాలి కదా! అంచేత నా ఓటు మద్యపాన నిషేధానికే !"

"నేను తాగగలను. "గలను" అనెందు కంటున్నానంటే ఎవ రయినా ఖర్చులు పెట్టుకుని నన్ను తాగిస్తే నేను సరదాగా తాగుతాను. లేకపోతే నాకా ఆలోచన రాదు. అంచేత మద్యపాన నిషేధమా, మద్య పాన నిషేధ నిషేధమా అనే విషయంమీద నాకొక అభిప్రాయమంటూ లేదు."

"నేను తాగను. కాని తాగేవాళ్ళ మధ్య గడపడం నాకు భలే సరదా. రకరకాల పదార్థాలు - తాగేటప్పుడు తినడానికి - తెప్పించు కుంటారు. వాళ్ళు తాగుడు హడావిడిలో వున్నప్పుడు అవి తీసుకు తినడం నా టేస్టుకి నిదర్శనం. తాగినవాళ్ళు చెప్పుకునే కబుర్లు చాలా బావుంటా యనుకోండి; అది వేరే విషయం !"

"నేను పెద్ద అధికారిని. ఆ బాధ్యతను ఇరవై నాలుగు గంటలూ, మూడు వందల అరవయ్యయిదు రోజులూ మొయ్యడం నా విధి. మధ్య మధ్య ఎవరికో వుపకారం చెయ్యాలనిపించినా ఉద్యోగ భారం చేత బిగిసిపోతాన్నేను. వాళ్ళా సంగతి కనిపెట్టి నేను తాగినప్పుడు నన్ను పట్టుకోగలిస్తే వాళ్ళ పన్లయిపోతాయి. తాగనంతసేపు నావల్ల దేశసేవ, తాగితే సంఘసేవ గ్యారంటీ. కనక నాకెలాగైనా వొకటే!"

"నాను పొద్దత్తమానం రెక్కలు ముక్కలేసుకుని మిశిన్ల మజ్జ మరో మిశిన్నై నస్తా వుంతాను. పొద్దుగూకే తలికి కడుపుల కాస్త సుక్క బడకపోతే - అది గవుర్మెంటు గాని కంపెనీ సరుగ్గానీ - ఏదో వొకటి - పడకపోయిందా, నా పెల్లాం నస్తది దెబ్బల్దిన్లేక. తాగుడు నా రెండో పెల్లం. అది వొర్దిల్లి నంతకాలం నా అసలు పెల్లం ఆరోగ్గెం గుంటది !"

ఇంకా - వైద్యశాస్త్రరీత్యా తాగుడు పెద్ద హానికరం కాదని, తాగుడు లేకండా సినిమాలో నటించడం దుర్లభమని, తాగి తందనాలాడ్డం లా ప్రకారం తప్పుగాని తాగడం తప్పుగాదని రకరకాల అభిప్రాయాలు చెప్పారు. రకరకాల వ్యక్తులు గోష్ఠిలో పాల్గొన్న స్త్రీలు నలుగుర్లో ముగ్గురు, తాగడం తప్పుకాదన్నారు. ఆఖరికి మావూరి సంస్కృత విద్యాపీఠం అధ్యక్షులు కూడా, తామున్నూ, తమ సహాధ్యాయులైన వేద పండితులున్నూ కలిసి "తీర్థ" యాత్ర వెళ్ళడం; "స్పిరిట్" యువల్ డిస్కోర్సులో పాల్గొనడం ఆనందదాయక విషయమని చెబుతూ వేదంలో దీన్ని తప్పుగా భావించడం జరగలేదని సెలవిచ్చారు.

స్టెనోగ్రాఫర్లు ఈ ఉపన్యాసా లన్నింటినీ రికార్డుచేసి, వెంట వెంటనే టైపు కొట్టించి, ఒక కాపీ సంతకం చేయించుకుని మంత్రిగారి కిచ్చేసి రాండో కాపీ ఎవరిది వారికి ఒప్పజెపుతున్నారు.

చివర్ని మంత్రిగారు లేచి, మా కందరికీ వందనాలు చెప్పారు. "మీలో ప్రతి ఒక్కరు తాము సభలో వున్నామని, తమ అభిప్రాయాలు రికార్డవుతున్నాయని జంకక నిజాన్ని ఉన్నదున్నట్టుగా చెప్పడం ముదావహం. మనలో ఎక్కువమంది తాగేవాళ్ళే అయినా; సంపూర్ణ మద్యనిషేధం తప్పదని మా ప్రభుత్వం అనుకొంటూంది. అలవాటున్న ప్రతివారికి ఇప్పట్లాగే అప్పుడు కూడా మద్యం అందుబాట్లో వుండ గలదని నేను విశ్వసిస్తున్నాను" అని ముగించారు. ఆయన ప్రసంగం రికార్డవలేదు. ప్రసంగం అయిపోగానే ఆయన కాలింగ్ బెల్ నొక్కారు.

అందరికీ మంచి మందుపార్టీ జరిగింది. ఆశయం నెరవేరు తోంది. ఆశ కూడా తీరుతోంది. అందుచేత "మళ్ళీ మధుమాసం" అనే పేరిట మొదలెట్టిన కథకి "మళ్ళీ మందు మాంసం" అని పేరు మార్చా లని నిశ్చయించుకున్నాను.

(29-10-77)